# రిజర్వాయర్ కల నెరవేరేనా?

- గూటుపల్లె చెరువు అభివృద్ధికి రైతన్నల ఎదురుచూపు
- నీటితో నింపితే తాగు, సాగునీటి కష్టాలు తీరినట్లేనన్న అభిప్రాయం

**బేతంచెర్ల:** మండల పరిధిలోని గూటుపల్లె చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ చెరువు రిజర్వాయర్‌గా మారితే దాదాపు 10 గ్రామాల్లో భూగర్భజలాల పెరుగుదలతో తాగునీటి సమస్య తీరుతుందని అంటున్నారు. గతంలో సరైన వర్షాలు లేకపోవడంతో గూటుపల్లె, ఆర్‌ఎస్ రంగాపురం, అంబాపురం, రహిమానుపురం, కొమ్మూరి కొట్టాల, హెచ్ కొట్టాల, ఆర్ బుక్కాపురం, ఆర్ కొత్తపల్లె తదితర గ్రామాల ప్రజలు తాగునీటి కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. పంటలు నష్టపోవడమే కాక, లక్షలు ఖర్చుచేసి వేసిన బోర్లకూ నీరు లేక రైతులు ఆర్థికంగా కుదేలయ్యారు. వేసవికాలంలో గుక్కెడు నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.351 కోట్లతో వాటర్‌గ్రిడ్ పథకం మంజూరైంది. ప్రస్తుతం గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా బేతంచెర్ల పట్టణంతో పాటు పలు గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోంది. అయితే మండలానికి సాగునీటి వనరులేవీ లేవు. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న రెండు చెరువుల్లో గూటుపల్లె చెరువు 175 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును నీటితో నింపితే సమీప గ్రామాలకు రెండు సంవత్సరాల వరకూ తాగునీటి కష్టాలు ఉండవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.


నీటితో కళకళలాడుతున్న గూటుపల్లె చెరువు (ఫైల్)


గోర్లగుట్ట చెరువు (ఫైల్)

**హంద్రీ–నీవా నుంచి నీరు నింపాలి**

సాగునీటి సమస్య పరిష్కారం కోసం గూటుపల్లె చెరువుకు హంద్రీ–నీవా ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని అందిస్తే, చెరువు కింద ఉన్న ఆయకట్టు పొలాలకు సాగునీరు లభిస్తుందని, భూగర్భజలాల స్థాయి పెరిగి బోర్లలో పుష్కలంగా నీరు వస్తాయని గ్రామస్తులు అంటున్నారు. దీంతో తాగునీటి సమస్యతో పాటు వ్యవసాయ సమస్యలకూ శాశ్వత పరిష్కారం లభించనుంది.

**గోర్లగుట్ట చెరువులో నీరు నిలవదు**

మండల పరిధిలోని గోర్లగుట్ట చెరువు 32 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నా, వర్షాలు వచ్చినపుడే కొద్దిపాటి నీరు నిల్వ ఉంటుంది. అధికారుల ముందుచూపు లేక, సాంకేతిక లోపాల వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టగానే చెరువులోని నీరు కొండచరియాల ద్వారా ఇంకిపోతుంది. ఒక్క ఎకరానికి కూడా ఆయకట్టు లేని ఈ చెరువులో నీరు నిలిచేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## క్లుప్తంగా

### బలవంతపు భూసేకరణ ఆపాలి


రైతు సదస్సు కరపత్రాలను పంచుతున్న సంఘం నాయకులు

**బేతంచెర్ల:** బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా ఈనెల 20న నంద్యాల పట్టణంలోని నేషనల్ పీజీ కాలేజ్ ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి రామ్మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం, గూటుపల్లె, అంబాపురం, రహిమానుపురం, నాగమళ్లకుంట గ్రామాల్లో సదస్సును విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు.

### ప్రజలు మెచ్చేలా సేవలందించాలి


మాట్లాడుతున్న కమిషనర్ హరిప్రసాద్

**బేతంచెర్ల:** నగర పంచాయతీ పరిధిలోని గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారి మన్ననలు పొందాలని కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో బదిలీపై వచ్చిన ఆయా గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఈకేవైసీ, తల్లికి వందనం, పీ4 సర్వేకు సంబంధించి పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే శనివారం జరిగే స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

**బేతంచెర్ల:** స్థానిక నంద్యాల రహదారిలోని గోపాలకృష్ణ బృందావనం ఆలయ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గొల్ల వెంకటస్వామి, అధ్యక్షుడిగా గుండా జగన్ మోహన్ రావు, కార్యదర్శిగా మద్దిలేటి, జాయింట్ సెక్రటరీగా వీరారెడ్డి, ఉపాధ్యక్షుడు గూని నాగరాజు, ట్రెజరర్ పరమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా అర్చకులు చిరంజీవి, శ్రీను చౌదరి, రమేష్ బాబు, బ్రహ్మయ్య ఆచారి, అరుణ్ బాబు, పవన్ కుమార్, రామచంద్రులను ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు, గ్రూప్ దేవాలయాల మాజీ చైర్మన్ గుండా జగన్ మోహన్ రావు తెలిపారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు


అంత్యక్రియలు పూర్తిచేసిన ఆత్మబంధువు సభ్యులు

**డోన్:** ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు శుక్రవారం ఓ అనాథ శవానికి అంత్యక్రియలు చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సీఐ ఇంతియాజ్‌బాషా ద్వారా సమాచారం తెలుసుకున్న ఆత్మబంధువు సభ్యులు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రొద్దుటూరుకు చెందిన చరణ్‌తేజారెడ్డి, రోటరీక్లబ్ సభ్యులు రాజయ్యగౌడ్ ఆర్థిక సహకారం అందించారని సేవాసమితి వ్యవస్థాపకుడు షాధిఖాన రాజు తెలిపారు. సభ్యులు గురుస్వామి, తాహెర్‌బాషా, బ్రహ్మయ్య, కానిస్టేబుళ్లు రామాంజనేయులు, ధనుంజయులు పాల్గొన్నారు.

### చౌడేశ్వరిదేవి ఆలయానికి విరాళం


విరాళం అందిస్తున్న దాత

**బనగానపల్లె:** మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి శుక్రవారం భక్తులు విరాళం అందజేశారు. యర్రగుంట్లకు చెందిన శేగిరెడ్డి వెంకటనాగేశ్వరరెడ్డి, విజయ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాభివృద్ధి కోసం రూ.50,116లను అర్చకులకు అందజేశారు. వారిని సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

### 23న మండల మీట్

**కొలిమిగుండ్ల:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23న ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద రెడ్డి శుక్రవారం తెలిపారు. సమావేశంలో వ్యవసాయం, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం, విద్య, వైద్యం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

## అందరి సహకారంతోనే ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యం


కళాశాల ఆవరణలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లను ఏరివేస్తున్న విద్యార్థులు

**కోవెలకుంట్ల:** ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్, తదితర ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకపోవడం వల్ల దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, తదితర వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అన్ని విధాలా శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, నరేంద్రనాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వందేళ్ల నాటి వేపచెట్టు తొలగింపు


క్రేన్ సాయంతో చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

**కొలిమిగుండ్ల:** స్థానిక ప్రధాన రహదారిలో చౌడేశ్వరిదేవి ఆలయానికి చెందిన చెట్టును శుక్రవారం గ్రామ పంచాయతీ సర్పంచ్ శివరాముడు ఆధ్వర్యంలో తొలగించారు. వందేళ్ల నుంచి వేపచెట్టు రోడ్డు పక్కన ఉండేది. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ప్రజలు చెట్టుకు పూజలు చేస్తుండేవారు. రెండేళ్ల నుంచి ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు, ప్రజలు సంచరిస్తుంటారు. పెనుగాలులకు చెట్టు కొమ్మలు విరిగిపడితే ప్రమాదం సంభవిస్తుందనే ఉద్దేశంతో యంత్రాల సాయంతో కట్ చేసి క్రేన్ సాయంతో కొమ్మలను కిందకు దించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు ఓవైపు దారిని బంద్ చేసి మరో వైపు రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు. అమ్మవారి చెట్టు తొలగించే సమయంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున చేరుకుని వీక్షించారు. తొలగించిన చెట్టు స్థానంలో గ్రామ పెద్దలు మరొక చెట్టును నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

- రూ. 25.68 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల


ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏఓ

**కోవెలకుంట్ల:** పట్టణంలోని ఓ ఫెర్టిలైజర్స్ దుకాణంలో ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయాలు జరుపుతున్న రసాయన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. శుక్రవారం కోవెలకుంట్లలోని పలు ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. లీలా ఫెర్టిలైజర్స్ దుకాణంలో రూ. 25.68 లక్షల విలువ చేసే రసాయన ఎరువులకు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో వాటి అమ్మకాలను నిలుపుదల చేస్తూ వాటిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. లైసెన్స్ దారులు ప్రభుత్వ అనుమతి ఉన్న రసాయన ఎరువులు, క్రిమి సంహార మందులను మాత్రమే విక్రయించాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు.

### కేజీబీవీ స్థలదాతకు నివాళి


భవాని సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**ప్యాపిలి:** స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చిన ఎస్‌ఎస్‌సీ భవాని సింగ్ వర్ధంతిని శుక్రవారం స్థానిక పాఠశాలలో నిర్వహించారు. హెచ్‌ఎం ప్రియాంక ఆధ్వర్యంలో భవాని సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవాని సింగ్ కుమారులు దేవి దయానంద్ సింగ్, బాలాజీ సింగ్, గౌతమ్ సింగ్ తదితరులు మాట్లాడారు. భావిభారత పౌరులు రూపుదిద్దుకునే విద్యాలయానికి స్థలాన్ని ఇచ్చే అదృష్టం తమ కుటుంబానికి దక్కిందన్నారు. అనంతరం విద్యార్థినులకు మిఠాయిలు, పెన్నులు పంచిపెట్టారు. కార్యక్రమంలో శేగు హరి, హరిస్వామి, నాగమల్లయ్య పాల్గొన్నారు.

## అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**డోన్ టౌన్:** ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగిస్తున్న రెవెన్యూ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, కమిటీ సభ్యుడు ఎస్‌ఏ చిన్న రహిమాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డోన్ మండలంలోని పలు ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేసి, కొందరు రెవెన్యూ అధికారులు కోట్లాది రూపాయలు ముడుపులు తీసుకొని భూబకాసురులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. రైతుల అసలైన భూములను కూడా హస్తగతం చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## పచ్చి ఖర్జూరం.. ఎంతో మధురం


పచ్చి ఖర్జూరాలు విక్రయిస్తున్న మహిళ

**డోన్ టౌన్:** ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న ఆధునిక సమాజంలో ప్రజలు పోషక విలువలున్న ఆహారాలవైపు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో తక్షణ శక్తిని అందించే పండ్లలో ఖర్జూరం పండ్లకు డిమాండ్ పెరుగుతోంది. ఒకప్పుడు అరబ్ ఎడారి దేశాలకు పరిమితమైన ఖర్జూరం సాగు, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోనూ విస్తరించి రైతులకు మంచి ఆదాయాన్ని అందిస్తోంది. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో వందల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. జీర్ణ శక్తి, రోగనిరోధక శక్తి, ఎముకల బలం, గుండె ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు ఖర్జూరాల్లో అధికంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అనంతపురం నుంచి తెప్పిస్తున్న ఈ పండ్లను డోన్‌లో చిరు వ్యాపారులు కిలో రూ.200కి విక్రయిస్తున్నారు. ఈతకాయలకు పోలికగా ఉండే ఈ పండ్లకు మార్కెట్లో డిమాండ్ నెలకొంది.

### వంట ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి

**ప్యాపిలి:** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి చంద్రశేఖర్ నాయక్, కేశవులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాఠశాలలో విద్యార్థులకు వడ్డించిన భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఏమాత్రం నాణ్యత లేకపోగా పలువురు విద్యార్థుల ప్లేట్లలో పురుగులు కనిపించాయని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయకపోవడం బాధాకరం అన్నారు. భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థులు బాత్‌రూం కొళాయిల నీటిని తాగాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

### మాజీ సర్పంచ్ మృతి

**కొలిమిగుండ్ల:** మండల కేంద్రం కొలిమిగుండ్లకు చెందిన మాజీ సర్పంచ్, వాల్మీకి సంఘం నాయకుడు దేవనకొండ సీతారామయ్య(62) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు వాల్మీకి సంఘం నాయకులు, రాజకీయ పార్టీ నాయకులు, గ్రామస్తులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

### బాధ్యతల స్వీకరణ

**ప్యాపిలి:** స్థానిక డిప్యూటీ ఎంపీడీఓగా ప్రభాకర్ శుక్రవారం ప్యాపిలి మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఈఓఆర్డీ బాలకృష్ణుడు పదోన్నతిపై బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఆలూరులో వీడీఓగా పని చేస్తున్న ప్రభాకర్ డిప్యూటీ ఎంపీడీఓగా ప్యాపిలికి పదోన్నతి పొంది బదిలీపై వచ్చారు.

### సీసీరోడ్డు ప్రారంభం

**కొలిమిగుండ్ల:** తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తుమ్మలపెంటలో సీసీరోడ్డును మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నామని చెప్పారు. కాలనీలోని పలు సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

### పేకాట రాయుళ్ల అరెస్ట్

**కోవెలకుంట్ల:** పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన తొమ్మిది మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. 35 వేలు నగదు, పేకముక్కలు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**డోన్‌టౌన్:** ఉద్యోగాల ఇంటర్వ్యూ కోసం తిరుపతికి వెళ్లిన డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జియో 5జీ సెల్‌టవర్ పనుల కోసం ఉద్యోగావకాశాలు ఉన్నాయని చెబుతూ కర్నూలు జియో టవర్స్ ఎండీ పేరుతో మెసేజ్ వచ్చిన సమయంలో అది నకిలీదా కాదా అనేది తెలుసుకోకుండానే ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ ఆరుగురు విద్యార్థులను తిరుపతికి పంపారని పేర్కొన్నారు. వెళ్లిన విద్యార్థులపై అక్కడ దాడి చేసి రూ.35 వేల నగదు, సెల్‌ఫోన్లు లాక్కున్నారని, ఇది బయటికి తెలియకుండా కళాశాల యాజమాన్యం వ్యవహరించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులకు ప్రాణ హానీ జరిగి ఉంటే బాధ్యత ఎవరిది? అని ప్రశ్నించారు. విద్యార్థులతో పాటు ఉద్యోగ క్యాంప్‌కు వెళ్లాల్సిన ప్లేస్‌మెంట్ అధికారి ఎందుకు వెళ్లలేదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ అధికారిపై కేసు నమోదు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఘనంగా తిరుచ్చి ఉత్సవం



**బేతంచెర్ల:** మండల పరిధిలోని మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా శుక్రవారం రాత్రి స్వామివారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటిస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించారు. పల్లకీపై కొలువుంచి మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కోవెలకుంట్ల:** స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కోవెలకుంట్ల, దొర్నిపాడు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అనంతరావు తెలిపారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల, దొర్నిపాడు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా మండలాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అహిర్ రెజిమెంట్ ఏర్పాటు చేయాలి


కోవెలకుంట్లకు చేరిన రెజాంగ్‌లా రాజ్ కలశయాత్ర

**కోవెలకుంట్ల:** భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్(యాదవ రెజిమెంట్) ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కన్వీనర్ దత్తాత్రేయ యాదవ్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రెజాంగ్‌లా రాజ్ కలశయాత్ర శుక్రవారం కోవెలకుంట్లకు చేరుకుంది. యాదవ సంఘం జిల్లా నాయకుడు బాలు యాదవ్ ఆధ్వర్యంలో యాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1962లో చైనాలోని రేజాంగ్ ప్రాంతంలో అహిర్ యాదవ్ రెజిమెంట్‌లోని 114 మంది యాదవ రెజిమెంట్లు చైనా సైనికులతో వీరోచితంగా పోరాడి వారిని మట్టికరిపించారని గుర్తు చేశారు. యాదవ రెజిమెంట్ సాధన కోసం చేపట్టిన ఈ యాత్ర కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఇచ్చాపురంలో ఈ నెల 9వ తేదీ ప్రారంభమై 23వ తేదీ నెల్లూరు జిల్లాతో యాత్ర ముగుస్తుందన్నారు. ఆ సంఘం రాయలసీమ కన్వీనర్లు కాటమ రాజు, శేషఫణి, మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి, జిల్లా కన్వీనర్ శివకృష్ణ, సీఎంఆర్ యాదవ్, రామచంద్రుడు, బాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**బనగానపల్లెకు చేరుకున్న యాత్ర**

**బనగానపల్లె:** భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రెజాంగ్‌లా రాజ్ కలశయాత్ర శుక్రవారం బనగానపల్లెకు చేరుకుంది. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి యాదవ్, బనగానపల్లె నియోజకవర్గ కన్వీనర్ మద్దయ్య యాదవ్, రాష్ట్ర నాయకులు చింతల మోహన్ రావు యాదవ్, శేషఫణి యాదవ్, జిల్లా కన్వీనర్ శివకృష్ణ యాదవ్, నాయకులు మద్దిలేటి యాదవ్, శంకర్ యాదవ్, రంగస్వామి, బాల వెంకటేశ్వర్లు, శీలమన్న, శ్రీనివాసులు, రామ పుల్లయ్య, పాండురంగ యాదవ్, శివకృష్ణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## రహదారిపై మట్టికట్టల పరిశీలన


రహదారిపై అడ్డుగా ఉన్న మట్టికట్టను పరిశీలిస్తున్న అధికారులు

**కోవెలకుంట్ల:** మండలంలోని కంపమల్ల గ్రామంలో కాల్వ పేరుతో తవ్వకాలు జరిపి రోడ్డుపైనే మట్టికుప్పలు వేయగా 10 నెలల నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం మైనర్ ఇరిగేషన్ శాఖ డీఈ నాగన్న, ఏఈ రాంమోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకుని రోడ్డుపై ఉన్న మట్టికట్టలను పరిశీలించారు. గ్రామంలోని బీసీ కాలనీ ప్రజలపై గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు రాజకీయ కక్షతో రహదారి కష్టాలు తెచ్చిపెట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 1.30 లక్షల గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి 150 మీటర్ల మేర కాలనీలో డ్రెయినేజీ ఏర్పాటు చేశారు. ఈ రహదారి వెంటే గ్రామానికి చెందిన రైతులు, కాలనీ ప్రజలు పొలాలు, ఊరకుంట, మెయిన్ రోడ్డుకు వెళుతున్నారు. డ్రెయినేజీ ఉన్నా 10 నెలల క్రితం టీడీపీ నాయకులు ఆ డ్రెయిన్ పక్కనే ప్రొక్లెయిన్‌తో కాల్వ పేరుతో తవ్వకాలు చేపట్టారు. తవ్విన మట్టిని రోడ్డుపైనే కుప్పలుగా పోయడంతో రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. పది నెలల నుంచి మట్టికట్టలు తొలగించకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై అడ్డుగా ఉన్న మట్టికట్టలు తొలగించి రహదారిని క్లియర్ చేయాలని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మైనర్ ఇరిగేషన్‌శాఖ అధికారులు గ్రామానికి చేరుకోగా కాలనీ వాసులు దాదాపు ఏడాది కాలం నుంచి పడుతున్న రహదారి కష్టాలను అధికారుల దృష్టికి తెచ్చారు. కాల్వ తవ్వకాలకు తమ శాఖకు ఎలాంటి సంబంధం లేదని చెప్పడంతో నివ్వెరపోయారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అనుమతి లేకుండా తవ్వకాలు ఎలా జరుపుతారని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. కాల్వ తవ్వకాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

**బేతంచెర్ల:** ఆషాడ మాసం చివరి శుక్రవారం సందర్భంగా బేతంచెర్ల అమ్మవారిశాలలో ఆర్య వైశ్యులు, వాసవీ మహిళా మండలి సభ్యులు ఉదయం నుంచి రాత్రి వరకు సామూహిక లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ అర్చకుడు పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో వాసవీమాతకు పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చన, 108 కొత్త చీరలు ఉంచి మహా మంగళహారతి ఇచ్చి పూజలు చేశారు.

### ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి


నాగరాజు మృతదేహం

**సంజామల:** ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందిన ఘటన సంజామలలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణయ్య వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి నాగరాజు (31) వ్యవసాయ పనుల నిమిత్తం వరిపొలంలో ట్రాక్టర్‌తో రోటావేటర్ చేస్తుండగా పొలం గట్టు ఎక్కే క్రమంలో వాహనం బోల్తాపడింది. నాగరాజు తలకు బలమైన గాయం కావడంతో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య రాజేశ్వరి, ఓ కూతరు ఉన్నారు. శుక్రవారం మృతుడి తండ్రి చాకలి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ప్రమాదకరంగా డ్రైనేజీ


ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ


బైక్ అదుపు తప్పి డ్రైనేజీలో పడిన యువకుడు

**డోన్:** పట్టణంలోని పాతబస్టాండ్ వద్దనున్న మహాత్మాగాంధీ విగ్రహం నుంచి బాలికల ఉన్నత పాఠశాల వరకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనున్న డ్రైనేజీ కాలువ ప్రజలకు ముప్పుగా మారింది. ఈ ప్రాంతంలో జనసంచారం ఎక్కువగా ఉంటుంది. డ్రైనేజీలోని మురుగు నీటిని శుభ్రం చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయపడే ఘటనలు తరచూ జరుగుతున్నాయి. పైకప్పు లేకపోవడంతో వర్షాకాలంలో డ్రైనేజీ నీరు రోడ్డుకు చేరి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. శుక్రవారం ఓ ద్విచక్ర వాహనదారుడు డ్రైనేజీలోకి పడిపోవడంతో స్థానికులు వెంటనే అతడిని రక్షించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు తక్షణమే డ్రైనేజీపై కవరింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా అరికట్టాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.